
నివాళులర్పిస్తున్న వినోద్ చౌగ్లే, దర్శన్


నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి కన్నయ్యలాల్ తదితరులు


నివాళులర్పిస్తున్న మనీలాల్‌షా, పద్మావతి, రాజేందర్ తదితరులు

మహాత్మాగాంధీ సేవలు చిరస్మరణీయం

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పలు ప్రాంతాల్లో పండ్లు పంపిణీ చేశారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


నివాళులర్పిస్తున్న క్రాంతి కుమార్, విద్యార్థులు


బాపూ సమాధి వద్ద వరలక్ష్మి, కురాకుల కృష్ణ


నివాళులర్పిస్తున్న అపోపా రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, దారం వేణుమాధవ్


బాపూ ధ్యానమందరింలో నివాళులర్పిస్తున్న చంటిబాబు


బాపూ ఘాట్‌లో నివాళులర్పిస్తున్న జియాగూడ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కిషన్ గజరే

సిటీ సివిల్ కోర్టులో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో వినోద్ కుమార్ మారూడి, న్యాయవాదులు

యాకుత్‌పురా: హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాజీగూడ రోటరీ చల్లా బ్లడ్ సెంటర్ సహకరంతో మంగళవారం పురానీహవేలిలోని కోర్టు ప్రాంగణంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 58 మంది న్యాయవాదులు రక్తదానం చేశారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్ కుమార్ మారూడి తెలిపారు. ఆయన మాట్లాడుతూ..రక్తదాన శిబిరంలో పాల్గొన్ని రక్తదానం చేసిన న్యాయవాదులకు ప్రత్యేక ధన్యవాదలన్నారు. ఈ శిబిరంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి రఘువీరారెడ్డి, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, క్రీడల కార్యదర్శి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు జ్యోతి, విజయ్ చంద్, మాజీ కార్యదర్శి చంద్రశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోటలో విదేశీ పర్యాటకుల సందడి



గోల్కొండ: చారిత్రక గోల్కొండ కోట మంగళవారం విదేశీ పర్యాటకులతో కొత్త శోభను సంతరించుకుంది. వందల సంఖ్యలో వివిధ దేశాల పర్యాటకులు కోటలో సందడి చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ దేశాల పర్యాటకులు టూరిస్టు బస్సుల్లో కోటకు చేరుకున్నారు. వీరిలో చాలా మంది తమ వెంట ఫొటో, వీడియో కెమెరాలు తెచ్చుకున్నారు. కోటలో అడుగు పెట్టగానే వారు కోట అందాలను తమ కెమెరాల్లో బంధించారు. 500 సంవత్సరాల చరిత్ర గల అద్భుతమైన కోటను చూస్తూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కోటలోని భారీ ఫిరంగులు, రహస్య గదులను చూసి ఔరా ఇండియన్ వెపన్స్ అంటూ నోరెళ్లబెట్టారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

యాకుత్‌పురా: డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నూతన పైప్‌లైన్ పనులు చేపట్టామని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. రెయిన్ బజార్ డివిజన్ సదత్‌నగర్‌లో రూ.5 లక్షల నిధులతో నూతనంగా చేపట్టిన సీవరేజ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను మంగళవారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పర్యటనలో మజ్లిస్ నాయకులు, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

సిలిండర్ల తయారీ పరిశీలన



చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజీ భౌతిక శాస్త్ర విభాగం తరఫున ఐఎస్ఐ స్టాండర్డ్ క్లబ్ విద్యార్థులు డాక్టర్ వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తూర్ గ్రామంలోని గ్యాస్ సిలిండర్ల తయారీ కర్మాగారాన్ని మంగళవారం సందర్శించారు. సిలిండర్ల తయారీలోని వివిధ దశలను కర్మాగార పర్యవేక్షకుడు ప్రీతం, భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ లక్ష్మీ శ్రీనివాస రావు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయి పరిశీలన విద్యార్థుల్లో ఆసక్తిని కలిగిస్తుందన్నారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నైనా వినోదిని క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పలు అంశాలను విద్యార్థులకు వివరించారు.

లబ్ధిదారులకు ఇళ్లను వెంటనే కేటాయించాలి

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గం గన్‌ఫౌండ్రీ డివిజన్ పరిధిలోని పూల్‌బాగ్ బస్తీలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను వెంటనే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ సీనియర్ కాంగ్రెస్ నేత బద్దం సతీష్‌గౌడ్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు. గతంలో మాజీ మంత్రి దివంగత ముఖేష్ గౌడ్ హయాంలో పూల్‌బాగ్ వాసులకు జేఎన్ఎన్‌యూఆర్ఎం స్కీమ్ ద్వారా 608 గృహ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత గృహ నిర్మాణ పనులు పూర్తయినా గత ప్రభుత్వం లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని సతీష్‌గౌడ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

యువత వ్యాపారంలో రాణించాలి


రిసాలబజార్‌లో మహ్మద్ నజీబ్ తదితరులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: యువత వ్యాపార రంగంలో రాణించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన రిసాలబజార్‌లో హిమార్ ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వ్యాపారంలోకి రావాలనుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ముందుకువస్తున్నాయన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్, హిమార్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ మహ్మద్ నజీబ్, ఖాలేద్ ఆలీ ఖాన్, ఉస్మానియా మజీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్, ఖాదర్, జలీల్ ఉన్నారు.

గోల్కొండ ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు



గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం సందర్భంగా ఆర్మూర్ ఏరియా ఆసుపత్రి వైద్య బృందంతో పాటు నోడల్ ఆఫీసర్ ఇన్‌చార్జి బృందం మంగళవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించింది. జాతీయ కాయాకల్ప అవార్డుకు ఆసుపత్రుల ఎంపిక జరుగుతుందని, ఇందులో భాగంగానే ఈ వైద్య బృందం గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించిందన్నారు. ఆయన హెల్త్ మిషన్ సభ్యులతో పాటు ఇతర వైద్యులతో కలిసి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను చూపించారు. ఆర్మూర్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ కార్తీక్, డాక్టర్ నజీయా, నర్సింగ్ సూపరింటెండెంట్ కమలమ్మ తదితరులున్నారు.

‘కుష్ఠు సాధారణ చర్మ వ్యాధే’


అవగాహన ర్యాలీ నిర్వహించిన వైద్యులు

అఫ్జల్‌గంజ్: కుష్ఠు వ్యాధి సాధారణ చర్మవ్యాధి మాత్రమేనని దీనికి శాశ్వత పరిష్కారం ఉందని, అపోహలు వీడాలని ఐఏడీవీఎల్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ వెంకటకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నెక్లెస్ రోడ్డులో సంఘం కార్యదర్శులు డాక్టర్ జేవీడీఎస్ ప్రసాద్, డాక్టర్ సహన, డాక్టర్ భూపేష్ కుమార్, డాక్టర్ పీఎస్. రావు, డాక్టర్ రమేష్, డాక్టర్ ఏజీ రావు, వైద్యులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్పర్శలేని తెల్లమచ్చలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. కుష్ఠు వ్యాధి శాపం కాదని, వంశపారంపర్యగా రాదని, ఇది ఒక లెప్రల్ అనే బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తుందని తెలిపారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అందరం కలిసి కుష్ఠు వ్యాధిని నిర్మూలిద్దామన్నారు.

ఫిబ్రవరి 20 నుంచి అయోధ్యలో అన్నదానం


కోటేశ్వర్ రావును సన్మానిస్తున్న రాధాకృష్ణ, విజయ్ భాస్కర్, మెడిశెట్టి రాకేశ్

అఫ్జల్‌గంజ్: అయోధ్య రామ మందిర ప్రాంగణంలో భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు బాస్ ప్రతినిధులు కె. రాధాకృష్ణ, విజయ్ భాస్కర్, మెడిశెట్టి రాకేశ్ తెలిపారు. మంగళవారం వీహెచ్‌పీ ఆల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోటేశ్వర్‌రావును కలిసి చర్చలు జరుపగా ఆయన సానుకూలంగా స్పందించి అన్నదాన కార్యక్రమానికి అనుమతి ఇచ్చారని తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఫిబ్రవరి 20 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాలకు చెందిన 12 మంది ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు.

ధర్మనిధి పురస్కారాల ప్రదానం



సుల్తాన్‌బజార్: 80 ఏళ్ల చరిత్రలో భాష, సాహిత్య వికాస సేవయే పరమావధిగా సారస్వత పరిషత్తు కృషిని కొనసాగిస్తున్నదని పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. మంగళవారం పరిషత్‌లో డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళా మందిరంలో జరిగిన ధర్మనిధి సాహిత్య పురస్కార ప్రదానోత్సవంలో ఆయన అధ్యక్షోపన్యాసం చేస్తూ సాహిత్య సేవలో దశాబ్దాలుగా కృషిని కొనసాగిస్తున్న సాహితీమూర్తులను సముచిత రీతిలో సత్కరిస్తూనే మరోవైపు ఈ తరానికి సృజనాత్మక సాహిత్య అధ్యయన శిబిరాలు నిర్వహిస్తూ రచనా నైపుణ్యాలు పెంపొందిస్తున్నట్లు తెలిపారు. శాసన మండలి పూర్వ సభ్యుడు ఎం.రామచంద్రరావు విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరిషత్తు నిర్వహిస్తున్న పురస్కారాలు కవి, రచయితలకు ప్రోత్సాహం కలిగిస్తాయని తెలిపారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ ఇటీవల నిర్వహించిన బాలసాహిత్య సమ్మేళనం, యువ రచయిత్రుల సమ్మేళనానికి విశేషమైన స్పందన లభించిందని తెలిపారు. బూర్గుల రంగనాథరావు పురస్కారాన్ని కోటం చంద్రశేఖర్‌కు పద్మభూషణ్ డాక్టర్ కె.అంజిరెడ్డి పురస్కారాన్ని చంద్రశేఖర్ ఆజాద్‌కు, డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య పురస్కారాన్ని ఎం.నారాయణ శర్మకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు రింగు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని జల్పల్లి, అబ్బాస్ బాగ్‌కాలనీలోని మైనారిటీ గురుకుల చార్మినార్ బాయ్స్–2 పాఠశాలలో యూటీఎఫ్ టిమ్రీస్ కేలండర్–2024ను పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్. వి.యాదయ్య మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ టిమ్రీస్ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షులు శైలజ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పదోన్నతులు, సకాలంలో నెలసరి జీతాలు. ఇతరాత్ర సమస్యలు పరిష్కరించడంలో యూటీఎఫ్ ముందుంటుందన్నారు. ఈ సమావేశం మల్లేశ్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీజేపీదే విజయం


పాండుయాదవ్‌ను సత్కరిస్తున్న బీజేపీ కన్వీనర్ సోమరాజ్‌సింగ్, బంగారు సుధీర్‌కుమార్

అబిడ్స్: రాబోయే ఎంపీ ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా బీజేపీదే విజయమని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి.పాండుయాదవ్ పేర్కొన్నారు. నూతనంగా మరోసారి గోల్కొండ అధ్యక్షుడిగా నియమితులైన పాండుయాదవ్‌ను గోషామహల్ బీజేవైఎం కన్వీనర్ సోమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాండుయాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు తరిమికొడతారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేయాలని ప్రజలంతా ఎదురుచూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా భూస్థాపితమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బంగారు సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కే.వి గ్యాస్‌బాగ్ కాలనీ, పురాణాపూల్ అండర్ గ్రౌండ్, పురాణాపూల్ ఓవర్‌హెడ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని గ్యాస్‌బాగ్ కాలనీ, నయాబస్తీ, లేబర్ అడ్డా, సేవాదళ్, జుమ్మేరాత్ బజార్, ఎంసీహెచ్ కార్యాలయం, బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కే.వి గౌలిగూడ, ఉస్మాన్‌గంజ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని అశోక్‌బజార్, నేషనల్ హోటల్, తారా హోటల్ లేన్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్, ఉస్మానియా ఆస్పత్రి లేన్, గోల్ మజీద్ లేన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. 11 కే వి రామకృష్ణ థియేటర్, జాంబాగ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని రామకృష్ణ థియేటర్, రిలయన్స్ కాంప్లెక్స్, జాంబాగ్, పూసలబస్తీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల అంతరాయం ఉంటుందన్నారు.

డీసీపీపై వీహెచ్ ఆగ్రహం

లంగర్‌హౌస్: మా ప్రభుత్వంలో మమ్మల్నే అడ్డుకుంటారా అంటూ వి. హనుమంతరావు డీసీపీ సాయి చైతన్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద గాంధీ వర్ధంతి సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. కేవలం గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు వెళ్లే దారిలో కొందరు స్థానిక నాయకులు లోపలకు వెళ్లే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు అడ్డుకోగా లోపలే ఉన్న వీహెచ్ గమనించి బయటకు వచ్చి వాళ్లను లోపలకు తీసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు వీహెచ్‌ను కూడా అడ్డుకున్నారు. తమ వారిని పంపాలని కోరినా పోలీసులు నిరాకరించి వీహెచ్‌ను మాత్రమే లోపలకు పంపారు. అనంతరం వీహెచ్ ఈ విషయాన్ని పలువురికి ఫోన్‌లో వివరించగా డీసీపీకి ఫోన్ రావడంతో 20 నిమిషాల తర్వాత ఇద్దరు స్థానికులను లోపలకు అనుమతించారు.

నిబంధనలు పాటించని హోటల్ నిర్వాహకుడికి జైలు

డబీర్‌పురా: నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి అనంతరం హోటల్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తికి నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ 2 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. రెయిన్ బజార్ ఇన్‌స్పెక్టర్ ఎ.మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..యాకుత్‌పురాకు చెందిన మహ్మద్ ఇబ్రహీం (30) స్థానికంగా ఫైజా కేఫ్ పేరుతో హోటల్‌ను నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి దాటిన అనంతరం కూడా తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. దీంతో పోలీసులు మహ్మద్ ఇబ్రహీంపై కేసు నమోదు చేసుకొని మంగళవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ ఇబ్రహీంకు 2 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం బోరబండ–భరత్‌నగర్ రైల్వే స్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఓ గుర్తు తెలియని వ్యక్తి(40) బోరబండ–భరత్‌నగర్ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే సిబ్బంది ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై బ్లాక్ రౌండ్ నెక్ టీషర్టు, నీలం రంగు ట్రాక్ ప్యాంటు, తెలుపు రంగు బనియన్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సంబంధీకులెవరైనా ఉంటే నాంపల్లి జీఆర్‌పీ రైల్వే పోలీసులను లేదా 99898 72799లో సంప్రదించాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోండి


కమిషనర్ బాలయ్యతో సమావేశమైన ఆనంద్ కుమార్‌గౌడ్

అబిడ్స్: జ్ఞాన్‌బాగ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులపై జీహెచ్‌ఎంసీ కఠిన చర్యలు తీసుకోవాలని గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. కొంతమంది వ్యక్తులు జ్ఞాన్‌బాగ్ కాలనీ కమ్యూనిటీ హాల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ప్రభుత్వం ఇంకా చర్యలు చేపట్టడం లేదని ఆయన అన్నారు. మంగళవారం అబిడ్స్ జీహెచ్‌ఎంసీ 14వ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బాలయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కొంతమంది కబ్జాదారులు జ్ఞాన్‌బాగ్ కాలనీ ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న జీహెచ్ఎంసీ, పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖ అధికారులు ఎందుకు ఆపడం లేదన్నారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏదైనా ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ శాఖలు నిర్మాణాలు చేపట్టాలని నిబంధనలు ఉన్నాయని ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. వెంటనే జ్ఞాన్‌బాగ్ కాలనీలో కొనసాగుతున్న అక్రమ కట్టడాలను ఆపని చో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన ఇస్తామని ఆనంద్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేష్ సింగ్, హైమద్ కిరణ్ జీహెచ్ఎంసీ సెక్షన్ అధికారి ముఖేష్ సింగ్ పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

సంతోష్‌నగర్: ట్రాఫిక్ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఐ.ఎస్.సదన్ చౌరస్తాలో సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహనాయక్ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం హెల్మెట్‌లు లేకుండా వాహనాలు నడిపే వాహనదారులకు ట్రాఫిక్ ఎస్సైలు సత్యనారాయణ, వెంకటప్ప సొంత డబ్బులతో హెల్మెట్‌లను కొనుగోలు చేసి అందజేసి సన్మానించారు.



ప్రత్యేక పూజలు



చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని హుస్సేనీఆలం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేష్ స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రాజు

గోల్కొండ: హెల్మెట్ నిండు ప్రాణాన్ని కాపాడే ఆయుధమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. మంగళవారం మెహిదీపట్నం జి.పుల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో జాతీయ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. బైక్ రైడర్లలో చాలా మంది హెల్మెట్ ఉండి కూడా తలకు పెట్టుకోవడం లేదన్నారు. గతేడాది 500 మందిని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనీ ఇనిస్టిట్యూట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. నెహ్రూ యువ కేంద్ర ఘటన, కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడాశాఖ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మాధవరెడ్డి, కోఆర్డినేటర్స్ గౌహర్‌సుల్తానా, జిల్లా యువజన విభాగం అధికారి ఖుష్బుగుప్తా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ తదితరులున్నారు.

అధ్వానంగా శాతం చెరువు రోడ్డు


శాతం చెరువు రోడ్డు పక్కన వ్యర్థాలు

గోల్కొండ: గోల్కొండ శాతం చెరువు రోడ్డు అధ్వానంగా మారింది. మహ్మదీ లైన్స్ నుంచి శాతం చెరువు మీదుగా నయాఖిలా వెళ్లే వారు శాతం చెరువు రోడ్డు ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ చెరువు రోడ్డు పొడవునా ప్రతి రోజూ టన్నుల కొద్ది వ్యర్థాల డంపింగ్ జరుగుతోంది. బల్దియా అధికారులు గానీ స్థానిక నాయకులుగానీ పట్టించుకోవడం లేదు. రాత్రి పూట ద్విచక్ర వాహనదారులు రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాల బారినపడుతున్నారు. బల్దియా పారిశుద్ధ్య సిబ్బంది ఈ వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు బల్దియా మలేరియా విభాగం వారు శాతం చెరువులో దోమలు వృద్ధి చెందకుండా చెరువులో పూడికలు తీస్తున్నారు. ఈ పూడికలను కట్టపైనే డంపింగ్ చేస్తున్నారు. దీంతో చెరువు కట్టకు ఉన్న ఫెన్సింగ్ కూడా ధ్వంసమవుతోంది. పారిశుద్ధ్య విభాగం వారు చెరువు కట్టపై వ్యర్థాలు డంప్ కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.